మొక్కలు నాటుతున్న రిజిస్ట్రార్ రఘురామిరెడ్డి , తదితరులు

ప్రతి మొక్క భవిష్యత్ తరాలను పరిరక్షిస్తోంది..

రిజిస్ట్రార్ డా. రఘురామిరెడ్డి

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 31: మనం నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ప్రాణం పోస్తున్నదని రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం వర్సిటీ పరిధిలోని ఆరోగ్యకేంద్రం, కళాశాల ఆవరణలో వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. చెట్లు మానవుని మనుగడకు, పర్యావరణ పరిరక్షణకు ప్రాణం పోస్తాయన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని కాపాడాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతీయ కేంద్రాల ఆవరణలో మొక్కలు విధిగా నాటాలని సూచించారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకోవడానికి ఉద్యమ స్ఫూర్తితో చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఆక్సీజన్‌తో పాటు , పండ్లు , నీడ నిరంతరం ఇస్తాయన్నారు. రావి, వేప, ప్లమోరియా, తదితర దాదాపు 150 మొక్కలను నాటారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఏఎస్ఎల్‌పీ (సీబీసీఎస్) మూడు, అయిదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈ నెల 9 నుంచి, ఎంబీఏ (సీబీసీఎస్) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈ నెల 12 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

ఆ గ్రామపంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేయవద్దు

ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతి



ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఆయా గ్రామాల నాయకులు

శంషాబాద్ రూరల్, జూలై 31 : ఆ నాలుగు గ్రామ పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేయవద్దని బుధవారం ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంషాబాద్ మండలంలోని రషీద్‌గూడ, హమీదుల్లానగర్, బహదూర్‌గూడ, చిన్నగోల్కొండ గ్రామ పంచాయతీలు ఔటర్‌రింగ్ రోడ్డు లోపలి భాగంలో ఉండటంతో ఆ నాలుగు పంచాయతీలను గ్రేటర్‌లో విలీనం చేయడానికి సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. గ్రేటర్‌లో మా గ్రామాలను విలీనం చేస్తే రైతులు, సామన్యప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. హమిదల్లానగర్ గ్రామ పంచాయతీ నుంచి 2018లో వేరుగా పంచాయతీ చేసిన రషీద్‌గూడను, పెద్దగోల్కొండ గ్రామం నుంచి బహదూర్‌గూడను వేరుగా చేయడంతో ఇక్కడి ప్రజలు కొత్తగా గ్రామ పంచాయతీలో కొనసాగుతున్నారు. వీరిని ఏకంగా గ్రేటర్‌లో విలీనం చేస్తే గ్రేటర్‌లో విధించే ఆస్తి పన్నులతో పాటు ఇతర ఖర్చులు మోయలేక ఇక్కడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో పాటు ఆ నాలుగు గ్రామ పంచాయతీలు జీవో 111 పరిధిలో ఉండడంతో గ్రేటర్‌లో విలీనం చేయకుండా ఉండాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్.. విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ఆ నాలుగు గ్రామాలను విలీనం చేయకుండా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో చిన్నగోల్కొండ సహకార సంఘం చైర్మన్ దవాణాకర్‌గౌడ్,మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి,నాయకులు మంచాల రవి, వెంకటేశ్ గౌడ్, కుమ్మరి నర్సింహా, జగన్‌మోహన్‌రెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, మంచర్ల ప్రభాకర్ ఉన్నారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి : రాష్ట్ర నాయకుడు కార్తీక్ రెడ్డి



బీఆర్ఎస్ రాష్ట్ర నేత పటోళ్ల కార్తీక్ రెడ్డితో శాస్త్రీపురం డివిజన్ నాయకులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 31: రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి అధ్వర్యంలో కాంగ్రెస్ పాలనపై ప్రజలు విరక్తి చెందారని , భవిష్యత్ అంతా ఉద్యమ నేత, మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ అధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందనుందని బీఆర్ఎస్ రాష్ట్ర యువ నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డి అన్నారు. బుధవారం తన నివాసంలో రాజేంద్ర నగర్ నియోజక వర్గం శాస్త్రీపురం బీఆర్ఎస్ డివిజన్ నాయకులు ఎండీ .ముఖ్రమ్ ఖాన్ ఆధ్వర్యం లో యువత ఆయనను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు, ప్రజలు ఎవ్వరూ దిగులు చెందాల్సిన అవసరం లేదన్నారు. త్వరలోనే మన ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ప్రధానంగా యువత, మేధావులు, మహిళలు తమ వైపే ఉన్నార ని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందన్నారు. అప్పటి వరకు ప్రజా సమస్యల పట్ల ప్రభుత్వాన్ని నిలదీయాలని సూచించారు. కొందరు స్వార్థపరులు పార్టీని మారరని , కార్యకర్తలు, నాయకులు, ప్రజలు ఎవ్వరూ పార్టీ మార లేదని సూచించారు. స్థానిక సమస్యలపట్ల సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అహ్మద్ పటేల్, ఎండీ , ఆషిఫ్. షేఖ్ అఫాన్, తదితరులు పాల్గొన్నారు.

పశుసంపదతోనే మనుగడ ..

డిసెంబర్ 17న దేశ వ్యాప్త సదస్సు : వీసీ సవ్యసాచిగోష్

బ్రోచర్ విడుదల చేస్తున్న వీసీ సవ్యసాచి గోష్, తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 31 : పశుసంపద పెంచేందుకు దక్షిణ భారతదేశ వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, రంగారెడ్డి జిల్లా , రాజేంద్రనగర్ పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి డా. సవ్యసాచి గోష్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో డిసెంబర్ 17 నుంచి జరిగే దేశవ్యాప్త సదస్సుకు సంబంధించి బ్రోచర్‌ను విడుదల చేసి ..మాట్లాడారు. దక్షిణ భారత్‌లో పొడి వాతావరణం ఉన్నందున పశు సంపద పెంచేందుకు అనుకూలమన్నారు. పశువుల్లో పరాన్న జీవులు, వాటి వ్యాధుల వల్ల జంతువుల ఉత్పాదకత తగ్గి, రైతులకు ఆర్థిక నష్టాన్ని చేకూరుస్తాయని, వీటి వల్ల ప్రజారోగ్యం కూడా దెబ్బతింటుందన్నారు. ఈ సదస్సులో పశుపరాన్న జీవుల యొక్క వివిధ అంశాలపై సుదీర్ఘ చర్చ జరగనుందన్నారు. నియంత్రణకు కావాల్సిన పరిష్కార మార్గాలపై సమాలోచన చేయనున్నట్లు తెలిపారు. సదస్సు ఆర్గనైజర్ డా. ఉదయ్ కుమా ర్ మాట్లాడుతూ ..ఈ సదస్సుకు దేశ నలుమూలనుంచి శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పశువైద్య పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొని పరాన్న జీవవ్యాధులను తగ్గించి పశువుల యొక్క ఉత్పాదకతను పెంపొందించేందుకు పరిష్కార మార్గాలకు దిశానిర్దేశం చేయనున్నారన్నారు.

నిమ్స్‌లో నిలిచిపోయిన మాతా శిశు సంరక్షణ కేంద్రం పనులు

ఖైరతాబాద్, జూలై 31 : నిమ్స్ దవా ఖానలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణ పనులు నిలిచిపోయాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఏడాది క్రితం అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి టి. హరీశ్ రావు పలు ప్రభుత్వ దవాఖానల్లో మతా శిశు సంరక్షణ కేంద్ర నిర్మాణాలను చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. అందుకుగాను రూ.490 కోట్లు సైతం కేటాయించారు. మార్చి 28న నిమ్స్ దవాఖానలో రూ.90 కోట్ల అంచనా వ్యయంతో ఎనిమిది అంతస్తులతో మాతా శిశు సంరక్షణ కేంద్రం నిర్మాణానికి శంకు స్థాపన సైతం చేశారు. అయితే టెండర్ల ద్వారా ఆ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ నిర్మాణ పనులను చేపట్టగా, దీంతో ఇప్పటికే సదరు కాంట్రాక్టర్ రూ.15కోట్లు ఖర్చు చేయగా, రూపాయి బిల్లు కూడా ప్రభుత్వం నుంచి విడుదల కాలేదు. దీంతో కాంట్రాక్టర్ ఆ నిర్మాణ పనులు నిలిపివేసినట్లు తెలిసింది.

సినిమా థియేటర్లపై జీహెచ్ఎంసీ అధికారుల నజర్..

భద్రత, సౌకర్యాలపై తనిఖీలు..మాల్స్, మల్టీప్లెక్స్‌లలో 'పార్కింగ్ ఫ్రీ' బోర్డులు

జూబ్లీహిల్స్,జూలై 31: సినిమా థియేటర్లకు వచ్చే ప్రేక్షకులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు జీహెచ్ఎంసీ అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాల మేరకు అధికారుల బృందాలు సినిమా థియేటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్, డిజాస్టర్, ఫుడ్ సేఫ్టీ, ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ ఎంఏయూడీ, ట్రాఫిక్ పోలీసులతో బృందాలుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కమర్షియల్ మాల్స్, మల్టీప్లెక్స్‌లలోని థియేటర్లలో పార్కింగ్ రుసుము వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు ఆయా థియేటర్లలో జీఓ నంబర్ 63 ప్రకారం 'పార్కింగ్ ఫ్రీ'.. బోర్డులు ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశా లు జారీ చేస్తున్నారు. థియేటర్లలో భద్రత, ఫైర్ సేఫ్టీ సిలిండర్లు.. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి అంతస్తు నుంచి బయటకు వచ్చే మెట్లదారి, క్యాంటీన్‌లలో పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలి స్తున్నారు.

ఆయుర్వేద దవాఖానలో బోనాల ఉత్సవాలు..

డాక్టర్ బీఆర్‌కేఆర్ ఆయుర్వేద దవాఖానలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఉద్యోగులు

వెంగళరావునగర్, జూలై 31 : ఆయుర్వేద దవాఖానలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎర్రగడ్డలోని డాక్టర్ బీఆర్‌కేఆర్ ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల ఆవరణలో విద్యవాహిని మాత, ఆయుర్వేద దవాఖాన ఆవరణలోని శ్రీకనక దుర్గామాత ఆలయాల్లో బుధవారం బోనాలు వేడుకలు నిర్వహించారు తెలంగాణ రాష్ట్ర ఆయూష్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ స్వరూప, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పరమేశ్వర్‌నాయక్‌లు అమ్మవార్లకు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కళాశాల, దవాఖాన అధికారులు, సిబ్బందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమాశ్రీనివాస్, టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్, టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముజీబ్ ఉస్సేన్, స్పోర్ట్స్ సెక్రటరీ శంకర్, టీఎన్‌జీవో ఆయూష్ విభాగం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు టీఎన్ చారి, కార్యదర్శి లక్ష్మణ్, వైద్య కళాశాల ప్రొఫెసర్లు, వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రతినిధులు

మత్తు పదార్థ రహిత సమాజానికి కృషి చేయాలి..

జూబ్లీహిల్స్, జూలై 31 : మత్తు పదార్థ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సినీ హీరో డాక్టర్ మాదల రవి, ఫిలింనగర్ ఎస్సై డాక్టర్ అంజనమ్మ అన్నారు. బుధవారం ప్రజా నాట్యమండలి హైదరాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ఫిలింనగర్ రౌండ్ టేబుల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జీవన్ ప్రకాశ్, టీచర్స్ శ్రీనివాస్, అనిత, మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి కళ్యాణ్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా 'ఇకేబనా' ప్రదర్శన..

ఖైరతాబాద్, జూలై 31: ప్రకృతిని మానవుడితో మమేకం చేస్తూ పురాతన బౌద్ధ సన్యాసుల సంప్రదాయ కళ 'ఇకేబనా' ప్రదర్శన వేడుకగా సాగింది. జపాన్ ఒహరా స్కూల్ ఆఫ్ ఇకేబనా 35 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం సోమాజిగూడలోని 'ది పార్క్ హోటల్'లో నిర్వహించిన కార్యక్రమంలో స్కూల్ హెడ్ మాస్టర్ లెమోటో హీరోకి ఒహరా, అసోసియేట్ ప్రొఫెసర్ హుజోకి ఒయమిదాతో కలిసి వివిధ వృక్ష, పుష్పజాతులను అందంగా అలంకరించారు. ఈ వేడుకలను జపాన్ కాన్సుల్ జనరల్ తకహషి మునియో, ఒహరా స్కూల్ ఆఫ్ ఇకేబనా హైదరాబాద్ చాప్టర్ అధ్యక్షురాలు నిర్మల అగర్వాల్, కార్యదర్శి ఇందుమతి దవలూరుతో కలిసి ప్రారంభించారు. తకహషి మునియో మాట్లాడుతూ.. అత్యంత పురాతన సంప్రదాయ కళగా ఇకేబనా ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిందన్నారు. ఈ కళకు 400 ఏండ్ల చరిత్ర ఉందని, ఇలాంటి వేడుకలు భారత్, జపాన్ల మధ్య సంస్కృతిక, సంప్రదాయ సంబంధాలు మెరుగుపరుస్తాయన్నారు.

ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తారా..!

మణికొండ, జూలై 31: తెలంగాణ రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను ప్రశ్నించే నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అని భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇందిరారాజిరెడ్డి అన్నారు. రాష్ట్ర మహిళా మోర్చా ఆదేశాల మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మహిళా మోర్చా నాయకులను ఇంటి వద్ద గృహ నిర్బంధం చేసి పోలీస్‌స్టేషన్‌లకు తరలించారన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలని రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందన్నారు. అక్రమ అరెస్టులు బీజేపీని ఎప్పుడు భయపట్టలేవన్నారు. మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలను ఆపకపోతే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడుతామని అన్నారు. కార్యకర్తలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారు... దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై రోజు రోజుకు అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్ర మహిళా మోర్చా ఆదేశాల మేరకు అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇందిరారాజిరెడ్డి అన్నారు. రాష్ట్ర మహిళా మోర్చా ఆదేశాల మేరకు మహిళలపై జరుగుతున్న హత్యలు, అత్యాచారాలకు నిరసనగా అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీంతో బుధవారం ఉదయం మణికొండలో నివాసం ఉంటున్న మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఇందిరారాజిరెడ్డితో పాటు మహిళా నాయకులు, మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ హల్లాలేను అత్తాపూర్ ఔట్‌పోస్ట్ పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..ఎన్నికల ముందు మహిళలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని అన్నారు.

మహిళ లకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 31: తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అత్తాపూర్ డివిజన్ బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమా హల్లాలే డిమాండ్ చేశారు. అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున అత్తాపూర్ డివిజన్

సమస్యలకు శాశ్వత పరిష్కారాలు..

మైలార్‌దేవ్‌పల్లి, జూలై 31: ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని శాశ్వత పరిష్కారాలు చూపిస్తున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలో రూ.9.95 లక్షలతో సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ .. కురుస్తున్న వర్షాలకు రోడ్లు పూర్తిగా పాడైపోయాయన్నారు. గోతులమయంగా మారిన రోడ్ల కారణంగా ప్రజ లు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సమస్య తన దృష్టికి రావడంతో వెం టనే అధికారులతో చర్చించి వీటికి శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు నిధులను మంజూరు చేయించి పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిద్ధేశ్వర్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్ స్పెక్టర్ రవి, ప్రజలు పాల్గొన్నారు.

మద్యం మత్తులో అదుపుతప్పి కారు బోల్తా

జూబ్లీహిల్స్,జూలై 31 : జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద అర్ధరాత్రి కారు బీభత్సం సృష్టించింది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తరువాత మద్యం మత్తులో బీ టెక్ విద్యార్థి తన స్నేహితుడితో కలిసి ప్రయాణిస్తున్న కారు ఒక్కసారిగా ఫుట్‌పాత్‌పైకి దూసుకుపోయి బోల్తా కొట్టింది. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వైపు నుంచి కృష్ణానగర్ వైపు వెళ్ళే మార్గంలో కారు అదుపుతప్పి బోల్తాకొట్టడంతో పాటు అక్కడున్న చెట్లు, టెలిఫోన్ స్తంభాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న సాకేత్ రెడ్డితో పాటు మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ఇద్దరినీ జూబ్లీహిల్స్ పోలీసులు చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలంలో కారు నడిపిన సాకేత్ రెడ్డికి బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేయగా 146 పాయింట్‌లు నిర్ధారణ అయినట్లు తెలిసింది.

పాత్రికేయులు నేరుగా రాజకీయాల్లోకి రావాలి

అభివాదం చేస్తున్న పాత్రికేయులు

ఖైరతాబాద్, జూలై 31 : అవినీతి, నేర రహిత, నిస్వార్థ సమాజం కోసం పాటుపడే పాత్రికేయులు నేరుగా రాజకీయాల్లోకి రావాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం అఖిల భారత వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్, తెలుగు రాష్ట్ర సంక్షేమ సంఘం, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం సంయుక్తాధ్వర్యంలో పాత్రికేయుల రాజకీయ పార్టీ ఆవిర్భావం జరిగింది. ఈ సందర్భంగా జీరో బేస్‌డ్ బడ్జెట్ పాలిటిక్స్, నవ సమాజ స్థాపన, సామాజిక న్యాయం, మహిళా సాధికారిత, నిరుద్యోగ యువత భవిష్యత్, అవినీతి నేర రహిత, నిస్వార్థ సమాజ నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో జైళ్ల శాఖ రిటైర్డ్ ఐజీ నర్సింహులు, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్ రాములు, ఏడబ్ల్యూజేఏ జాతీయ అధ్యక్షుడు కె.కోటేశ్వర్ రావు, జాతీయ కోఆర్డినేటర్ గిరిరాజ్ బెలిదే హరినాథ్, ఏపీ అధ్యక్షుడు నామాల విశ్వేశ్వరరావు, తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అనంచిన్ని వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు

జూబ్లీహిల్స్, జూలై 31: జనాభాకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని రహ్మత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. బుధవారం ఎస్‌పీఆర్ హిల్స్ టి.అంజయ్య నగర్‌లో సీవరేజీ లైన్ విస్తరణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ రాజేందర్, బస్తీ నాయకులు ఆండాళమ్మ, శివ, డివిజన్ నాయకులు శాంత కుమార్, రాములు, యాదన్న, సింగారి శ్రీనివాస్, కుమార్, నాగరాజు, ఇతర బస్తీ నాయకులు పాల్గొన్నారు.

పార్కుల సౌకర్యాలపై దృష్టి పెట్టండి..

- పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలి..
- జడ్సీ ఉపేందర్ రెడ్డి

యూసుఫ్‌గూడ కృష్ణకాంత్‌పార్కులో పర్యటిస్తున్న జడ్సీ ఉపేందర్ రెడ్డి, అధికారులు

జూబ్లీహిల్స్, జూలై 31 : ప్రజారోగ్యానికి దోహదంచేసే పార్కులపై దృష్టి పెట్టాలని.. పార్కుల్లో పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. సందర్శకులు, వాకర్స్ కోసం అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. బుధవారం యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కులో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వాకర్స్‌తో, సీనియర్ సిటిజన్స్‌తో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. వాకర్స్ కోసం పాత్ వేల అభివృద్ధి, ఇతర సౌకర్యాలను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్కుల్లో చెత్త, గ్రీన్ వేస్టేజ్ లేకుండా చర్యలు తీసుకోవాలని.. చెట్ల సంరక్షణకు నిరంతరం చర్యలు తీసుకుంటూ కొత్త మొక్క లు నాటాలన్నారు. చారిత్రకమైన కృష్ణకాంత్ పార్క్ ప్రాధాన్యతను కాపాడాలని సూచించారు. అనంతరం అధికారులతో కలిసి 19 వ సర్కిల్‌లోని యూసుఫ్‌గూడ బస్తీ, బోరబండ, ఆర్‌కే కాలనీ, కళ్యాణ్ నగర్‌లలో పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్లపై నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలని.. గుంతలు లేకుండా పూడ్చి వేయాలని.. అంటువ్యాధులు ప్రబలకుండా ఎంటమాలజీ ఆధ్వర్యంలో తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్ అనిల్ కుమార్, ఈఈ రాజ్‌కుమార్, యూబీడీ మేనేజర్ యూసుఫ్ పాషా, డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, ఎస్ఎస్ విజయ్ కుమార్, యూబీడీ సూపర్‌వైజర్ మహబూబ్ అలీ, అధికారులు పాల్గొన్నారు.

ప్లాట్లను ఇప్పించి ఆదుకోండి

ప్రభుత్వానికి ఎమ్మార్ బాధితుల విన్నపం

ఆందోళన చేస్తున్న ఎమ్మార్ బాధితులు

ఖైరతాబాద్, జూలై 31 : పైసా పైసా కూడ బెట్టి వాయిదా పద్ధతిలో ప్లాట్లను కొనుక్కుంటే వాటిని బలవంతంగా లాక్కున్నారని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని ఎమ్మార్ ప్లాట్ల యజమానులు కోరుతున్నారు. బుధవారం వాసవి సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నానక్‌రామ్‌గూడ ప్లాట్స్ ఓనర్స్ సంఘం ప్రతినిధులు కడియాల రాజేంద్ర, మేజర్ ఘన్‌శ్యామ్ పాండేలు మాట్లాడుతూ.. గత 20 సంవత్సరాలుగా తమ జాగల కోసం పోరాడుతున్నామని, 160 మంది కుటుంబాల భవిష్యత్‌కు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నఫీజా బేగం, రోహిణి, భీంసేన్ రావు, సుంకర పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ

నిమ్స్ దవాఖానలో సుదీర్ఘకాలం సేవలందించిన పలువురు ఉద్యోగులు బుధవారం పదవీ విరమణ పొందారు. నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప శాలువా, మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ డాక్టర్ శాంతి వీర్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్, జూలై 31

ఆరోగ్య బీమా పాలసీలపై జీఎస్‌టీని ఉపసంహరించుకోవాలి

మణికొండ, జూలై 31: వైద్య ఆరోగ్యం, ప్రాథమిక విద్య సదుపాయాలు దేశంలోని ప్రతి ఒక్కరికి దక్కాలని ది సిటిజన్స్ కౌన్సిల్ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ అన్నారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ట్విటర్(ఎక్స్) వేదికగా ప్రశ్నించడం జరిగిందని బుధవారం ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా అందరికి అందుబాటులో ఉండే విధంగా వైద్య ఆరోగ్య సదుపాయాలను కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. గడిచిన 76 సంవత్సరాల్లో దేశంలో వైద్య ఆరోగ్య సదుపాయాలు అందరికి అందుబాటులో లేవన్నారు. ఇటువంటి పరిస